క్లుప్తంగా

ఎమ్మెల్యే కేపీ, జంకె శివరాత్రి శుభాకాంక్షలు


ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి


వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె

మార్కాపురం: మహాశివరాత్రి పర్వదినాన్ని మార్కాపురం నియోజకవర్గ ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు సంతోషంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డిలు కోరారు. పుణ్యక్షేత్రాలకు వెళ్లే యాత్రికులు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పరమేశ్వరుని ఆశీస్సులు అందరికీ ఉండాలని దేవుణి ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

పశు పోషకులు అప్రమత్తంగా ఉండాలి

పొదిలి రూరల్: పశు పోషకులు పశువులకు వచ్చే వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ పి. వెంకట సుబ్బయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని మూగచింతలలో పశుసంవర్ధక శాఖ, రిలయన్స్, సార్ప్స్ సంస్థ సంయుక్తంగా నిర్వహించిన పశువైద్య శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి పరిశ్రమ అభివృద్ధి కోసం పాల ఉత్పత్తి పెంచితే ప్రతి ఒక్కరూ ఆర్థికంగా అభివృద్ధి చెందుతారన్నారు. పశువులకు సోకే వ్యాధులతో రైతులు జాగ్రత్తగా ఉండాలన్నారు. అనంతరం రైతులకు మందులు, గడ్డి విత్తనాలు పంపిణీ చేశారు. రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధి బాబూరావు, ఉన్నగురువాయుపాలెం పశు వైద్యాధికారి మంచికల మణిశేఖర్ ఉన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

తాళ్లూరు: ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ ఇమ్మానియేల్ రాజుకు ఆ సంఘ బాధ్యులు జవహర్‌బాబు, రమేష్‌లు వినతిపత్రం అందించారు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం కొనసాగించాలని, మున్సిపల్ ఉపాధ్యాయులకు పీఎఫ్ సౌకర్యం కల్పించటం వంటి 17 దీర్ఘకాలిక సమస్యలను వినతి పత్రంతో విన్నవించారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వినతి పత్రాలు అందించినట్లు బాధ్యులు తెలిపారు.

కాఫీ విత్ క్లాప్స్‌కు హాజరైన డీఎల్‌పీఓ

తాళ్లూరు: గ్రామాల్లో స్వచ్ఛత ప్రాధాన్యతను ప్రజలకు తెలిపి గ్రామాలను స్వచ్ఛతగా తీర్చిదిద్దాలని డీఎల్‌పీఓ పద్మ అన్నారు. బెల్లంకొండవారిపాలెంలో శనివారం కాఫీ విత్ (గ్రీన్ అంబాసిడార్) క్లాప్స్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక చెత్త నుంచి సంపద కేంద్రాన్ని సందర్శించారు. సర్పంచి పోశం సుమలత, ఎంపీటీసీ జి.సరస్వతి, ఈఓఆర్డీ ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.


విద్యుద్దీపాలతో ముస్తాబైన పొదిలి శివాలయం


ధ్వజారోహణ

శివరాత్రికి ఆలయాలు ముస్తాబు

పొదిలి రూరల్: మండలంలోని అన్ని గ్రామాల శివాలయాలు శివరాత్రికి ముస్తాబయ్యాయి. ముఖ్యంగా పట్టణంలోని శివాలయంలో ఉన్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రం నిర్మమహేశ్వరస్వామి దేవాలయం, ఈగలపాడు సంగమేశ్వర దేవాలయం, ఏలూరు, ఆముదాలపల్లి, ఉప్పలపాడు, మాదాలవారిపాలెం, అన్నవరం దేవాలయాల్లో శివరాత్రికి నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆయా దేవాలయాలకు రంగులు వేసి విద్యుద్దీపాలతో అలంకరించారు. శివరాత్రికి భక్తులు ఎక్కువగా వచ్చే అవకావం ఉండటంతో ఎక్కడా ఎటువంటి అసౌకర్యం కలగకుండా ముందు జాగ్రత్తలతో ప్రత్యేక క్యూలైన్ల్ ఏర్పాటు చేశారు. ఎండ ఎక్కువ ఉండటంతో ఆలయ ఆవరణలో టెంట్‌లు వేశారు. సౌకర్యవంతమైన దర్శనం, తాగేందుకు నీరు, అన్న ప్రసాదాల ఏర్పాటు, వైద్యసేవలు, పారిశుధ్యం వసతులు ఏర్పాటు చేశారు. శుక్రవారం నిర్మమహేశ్వర స్వామి వారు పార్వతీ పరమేశ్వర అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు.

బేస్తవారిపేట: మండలంలోని శైవక్షేత్రాలు శివరాత్రి సందర్భంగా ముస్తాబు చేశారు. శివరాత్రిని పురస్కరించుకుని ఆలయాలను ప్రత్యేకంగా అలంకరించి ఏర్పాట్లు చేస్తున్నారు. మండలంలోని సోమవారిపేట, మోక్షగుండం, పిటికాయగుళ్ల, ఒందుంట్ల, కోనపల్లె గ్రామాల్లో శివాలయాలను ప్రత్యేకంగా అలంకరించి శివరాత్రి పర్వదినానికి సిద్ధం చేశారు.

మార్కాపురం: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని శివాలయంలో శుక్రవారం ధ్వజారోహణ కార్యక్రమంతో శివరాత్రి ఉత్సవాలను ఆలయ చైర్మన్ వి.కేశవరావు, అర్చకులు ప్రారంభించారు. ఇందులో భాగంగా శనివారం రాత్రి 8 గంటలకు పార్వతీపరమేశ్వరుల ఏదురుకోలా, గ్రామోత్సవం అనంతరం కల్యాణంను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. లింగోద్భవ కాలంలో స్వామివారికి మహాన్యాణ పూర్వ రుద్రాభిషేకం 108 బిందెల జలంతో భక్తులచే అభిషేకం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చైర్మన్ బాలమురళీకృష్ణ పాల్గొన్నారు.

దర్శి టౌన్: శివరాత్రి పర్వదినం నేపథ్యంలో శైవక్షేత్రాలన్నీ ముస్తాబయ్యాయి. నియోజకవర్గంలోని పలు ప్రసిద్ధ దేవాలయాలు ఇప్పటికే సిద్ధమయ్యాయి. స్వామి వారిని దర్శించుకుని వరాలు పొందేందుకు అధిక సంఖ్యలో భక్తులు ఆలయాలకు వెళ్లనున్నారు. దర్శి మండలంలో గంగా అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర ఆలయం, కొర్లమడుగు పార్వతి సమేత సోమేశ్వరరాలయం, పోతవరం శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేయనున్నారు. తాళ్లూరు మండలంలో అగస్త్యేశ్వర ఆలయం, గంగా పర్వత వర్ధిని సమేత సోమేశ్వర ఆలయం, గుంటి గంగా భవాని వద్ద ఆలయం, తాళ్లూరు, మాధవరం, లక్కవరం శివాలయాలు, క్రిష్ణ స్వామి ఆశ్రమం వద్ద ప్రత్యేక పూజలు చేయనున్నారు.

కొనకనమిట్ల: భక్తుల మొక్కులు తీర్చే భోళాశంకరునిగా పేరొందిన శివాలయాలు మహాశివరాత్రికి ముస్తాబయ్యాయి. శనివారం మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మండలంలోని ఎదురాళ్లపాడు సంగమేశ్వరాలయం, సలనూతల కొండల్లో వెలసిన అన్నపూర్ణ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం, అంబాపురంలో అంబబాల త్రిపుర సుందరి ఆలయం, బ్రాహ్మణపల్లి కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం, కొనకనమిట్లలో ఉమాపార్వతి రామలింగేశ్వర ఆలయం, చినారికట్ల గంగా పార్వతీ సమేత చెన్నమల్లేశ్వరస్వామి, పెదారికట్ల, రేగడపల్లి, బచ్చలకూరపాడు, మునగపాడు గ్రామాల్లోని శివాలయాల్లో అభిషేకాలు, అర్చనలు, శాంతి కల్యాణాలు నిర్వహించనున్నారు. బ్రాహ్మణపల్లిలో అన్నదానం చేయనున్నారు. అంబాపురంలో శివరాత్రి ఉత్సవాలు మూడు రోజుల పాటు నిర్వహిస్తారు.

పెద్దదోర్నాల: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైలం వెళ్లే యాత్రికులు, శివభక్తులకు శుక్రవారం పలు ధార్మిక సంస్థలు అన్నదానంతో పాటు మంచినీరు, మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు. మండల రెడ్ల సంఘం నాయకులు గంటా రమణారెడ్డి, బట్టు సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో, ఇస్కాన్ ప్రతినిధి అమల నియమదాస్ నేతృత్వంలో, శ్రీకృష్ణదేవరాయల కాపు, బలిజ, ఒంటరి, తెలగ సేవా సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.


ముక్తీశ్వరక్షేత్రం..


ఇస్కాన్ ఆధ్వర్యంలో అన్నదానం

మహాశివరాత్రికి భారీ బందోబస్తు



మార్కాపురం: మహాశివరాత్రి పండగను పురస్కరించుకుని ఘాట్ రోడ్డులో భారీ బందోస్తు ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ డాక్టర్ ఎం.కిశోర్‌కుమార్ తెలిపారు. తనతో పాటు నలుగురు సీఐలు, 12 మంది ఎస్‌ఐలు, 120 మంది పోలీసులతో పాటు స్పెషల్ పార్టీ పోలీసులు కూడా విధి నిర్వాహణలో ఉంటారన్నారు. దోర్నాల నుంచి శ్రీశైలం, దోర్నాల నుంచి ఆత్మకూరు మధ్య ఘాట్ రోడ్డులో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రయాణికుల రాకపోకల్లో అంతరాయం లేకుండా ఉండేందుకు పెద్దారవీడు మండలం కుంట వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను డైవర్షన్ చేస్తున్నట్లు తెలిపారు. వివిధ రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి శ్రీశైలానికి భక్తుల తాకిడి ఎక్కువగా ఉన్నందున దోర్నాల మీదుగా ఆత్మకూరు, నంద్యాలకు వెళ్లాల్సిన భారీ వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు కుంట జంక్షన్ నుంచి మార్కాపురం మీదుగా గిద్దలూరు నుంచి నంద్యాలకు వెళ్లాలని తెలిపారు. వాహనదారులు పోలీస్ సిబ్బందికి సహకరించాలన్నారు. దోర్నాల శ్రీశైలం మధ్య, దోర్నాల-ఆత్మకూరు మధ్య ఎక్కడైనా వాహనాలు మరమ్మతులతో ఆగిపోతే తొలగించేందుకు క్రేన్‌ను కూడా ఆయా ప్రాంతాల్లో ఉంచినట్లు డీఎస్పీ కిశోర్‌కుమార్ వివరించారు.

లివర్ బాధితురాలికి రూ.10 లక్షలు మంజూరు

యర్రగొండపాలెం: లివర్ సమస్యతో బాధపడుతున్న ఓ మహిళలకు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ చొరవతో సీఎంఆర్‌ఎఫ్ నుంచి రూ.10 లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు మంత్రి శుక్రవారం విజయవాడలోని తన క్యాంప్ కార్యాలయంలో బాధితురాలి భర్తకు ఎల్‌వోసీ కాపీని అందజేశారు. మండలంలోని ఎస్.కొత్తపల్లి గ్రామానికి చెందిన అంబటి మల్లేశ్వరి గత కొంత కాలంగా లివర్ సమస్యతో బాధపడుతోంది. చికిత్సకు రూ.20 లక్షలు అవసరమవుతాయని వైద్యులు తెలిపారు. ఈ విషయాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి మంత్రి తీసుకెళ్లడంతో రూ.10 లక్షలను లెటర్ ఆఫ్ క్రెడిట్ ద్వారా మంజూరు చేశారు. సీఎం, మంత్రికి బాధిత మహిళ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కొప్పర్తి ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు.


బాధితురాలి భర్తకు ఎల్‌ఓసీ అందజేస్తున్న మంత్రి సురేష్

ఉగాది లోపు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి


మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మాధవన్


హౌసింగ్ కాలనీని పరిశీలిస్తున్న డీపీఓ

● సబ్ కలెక్టర్ మాధవన్

మార్కాపురం టౌన్: ఉగాది లోపు లబ్ధిదారులందరూ జగనన్న లేఔట్‌ల్లో ఇంటి నిర్మాణాలు పూర్తి చేయాలని సబ్ కలెక్టర్ సేతు మాదవన్ చెప్పారు. శుక్రవారం ఆయన మండలంలోని ఇడుపూరు, వేములకోట లేఔట్‌ల్లో గృహనిర్మాణ దినోత్సవం నిర్వహించారు. సచివాలయంలోని ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు లబ్ధిదారులతో మాట్లాడి గృహాలు త్వరగా పూర్తి అయ్యేలా చూడాలన్నారు. వలంటీర్‌లు కూడా ఈ విషయంలో లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. ఇంటి నిర్మాణం కోసం ఇచ్చిన రుణాలు వ్యక్తిగత అవసరాలకు వాడుకోకుండా చూడాలన్నారు. నాణ్యమైన ఇళ్ల నిర్మాణం జరిగేలా పర్యవేక్షించాలన్నారు. ఎంపీడీవో చందన, హౌసింగ్ ఏఈ సాయిచంద్, ఏపీవో జీవరత్నం, ఏపీఎం రమేష్ పాల్గొన్నారు.

ఉగాది నాటికి గృహాలు పూర్తి చేయాలి

కొనకనమిట్ల: జగనన్న కాలనీలకు సంబంధించి ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులు త్వరితగతిన ఇంటి నిర్మాణాలు పూర్తి చేసి ఉగాది పండగకు గృహ ప్రవేశాలు చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు మండల ప్రత్యేకాధికారి విజయరత్నం అన్నారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని గొట్లగట్టు జగనన్న కాలనీ లేఔట్లను తహసీల్దార్ కేవీఆర్‌వీ ప్రసాదరావు, ఎంపీడీఓ కార్యాలయ పర్యవేక్షకుడు శ్రీనివాసరావుతో కలిసి ఆయన పరిశీలించారు. అక్కడ ఇంటి నిర్మాణాలు చేస్తున్న లబ్ధిదారులతో పాటు ఇంకా ఇంటి నిర్మాణాలు చేపట్టని వారితో సమావేశమయ్యారు. జగనన్న కాలనీలో ఇళ్లు కట్టుకొనే వారికి ప్రభుత్వం నీటి వసతి, విద్యుత్ సౌకర్యం కలిపిస్తోందన్నారు. సొసైటీ చైర్మన్ ఉడుముల కాశిరెడ్డి, వీఆర్‌ఓ దిలీప్‌కుమార్, కార్యదర్శి ప్రసాద్, సచివాలయ కన్వీనర్లు ఎస్.ప్రసాద్, ఏడుకొండలు, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ బాలునాయక్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ గీత, వెల్ఫేర్ అసిస్టెంట్ నాగార్జునరెడ్డి ఉన్నారు.

ఇళ్లు వేగవంతంగా నిర్మించుకోవాలి

దొనకొండ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న హౌసింగ్ కాలనీలను లబ్ధిదారులు వేగవంతంగా నిర్మించుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) జీవీ నారాయణరెడ్డి సూచించారు. మండలంలోని గంగదేవిపల్లిలో జగనన్న హౌసింగ్ కాలనీ పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఫ్రైడే హౌసింగ్ డేలో హౌసింగ్ కాలనీలను పరిశీలించి లబ్ధిదారులకు సూచనలు, సలహాలు అందించారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచడమే లక్ష్యం

● డ్వామా పీడీ శీనారెడ్డి

తాళ్లూరు: జిల్లాలో ఉపాధి కూలీల సంఖ్య రోజుకు లక్ష మందికి పెంచడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు డ్వామా పీడీ శీనారెడ్డి అన్నారు. మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఉపయోగపడే పనులు అధికంగా చేపడుతున్నట్లు చెప్పారు. ప్రస్తుతం 50 వేల మంది పనుల్లో పాల్గొంటున్నారని పేర్కొన్నారు. వ్యవసాయ పనులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో తక్కువ మంది ఉపాధి పనుల్లో పాల్గొంటున్నారని, వ్యవసాయ పనులు తగ్గుముఖం పడితే కూలీల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. కొర్రపాటివారిపాలెం మైనర్ కాలువ ప్రాంతాల్లో చేపట్టిన కాలువల పూడికతీత పనులు పరిశీలించారు. కొలతల ప్రకారం పనులు చేయాలని, రోజూ రెండు పూటలా పని చేయాలని కోరారు. ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ ఐ.వెంకటేశ్వర్‌రెడ్డి, కో ఆప్షన్ మెంబర్ కరిముల్లా, ఏపీడీ పద్మశ్రీ, ఏపీఓ మురళి, ఈసీ ప్రసాద్ పాల్గొన్నారు.


ఉపాధి పనులు పరిశీలిస్తున్న పీడీ శీనారెడ్డి

ఉన్నత లక్ష్య సాధనకు కష్టపడాలి

మార్కాపురం టౌన్: విద్యార్థులు నైతిక ప్రవర్తన, చక్కటి మార్గంలో ప్రయాణించి ఉన్నత లక్ష్య సాధనకు కష్టపడి చదవాలని సీఐ భీమానాయక్ అన్నారు. శుక్రవారం సాయంత్రం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో పోలీస్ శాఖ, హెచ్‌ఎం చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు జీవన నైపుణ్యాలు, నైతికతపై అవగాహన కల్పించారు. చదువులమ్మ ఒడిలో భద్రంగా ఉన్నారని, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. ఏదైనా ఇబ్బందికర పరిస్థితి ఏర్పడితే తల్లిదండ్రులు, గురువులకు చెప్పాలని, అవసరమైతే పోలీస్ సాయం తీసుకోవాలన్నారు. 10వ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి రాష్ట్ర స్థాయిలో పాఠశాలకు మంచి పేరు తేవాలని కోరారు. హెచ్‌ఎం మాట్లాడుతూ పెరుగుతున్న శాస్త్ర, సాంకేతిక విజ్ఞానం మనిషిని మంచి మార్గంలో ప్రయాణించేలా ఉన్నతంగా తీర్చిదిద్దేలా ఉండాలన్నారు. అనంతరం ఆయన్ను సన్మానించారు. ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, మునలయ్య, శివాంజనేయులు, ఎన్‌సీసీ ఆఫీసర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీఐ భీమానాయక్

సంక్షిప్తంగా

నేడు యాదవ యువకుల బైక్ ర్యాలీ

గిద్దలూరు రూరల్: బీసీ నాయకుడు బోడె రామచంద్ర యాదవ్ గిద్దలూరు పట్టణంలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయానికి విచ్చేస్తున్న సందర్భంగా యాదవ యువకులు శనివారం బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు బీసీ నాయకుడు పెట్టెల నారాయణ యాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రామచంద్ర యాదవ్‌కు ముండ్లపాడు రోడ్డులోని ఆదర్శ బీఈడీ కళాశాల నుంచి పెద్ద ఎత్తున స్వాగతం పలుకుతూ అక్కడి నుంచి బైక్ ర్యాలీగా వేణుగోపాలస్వామి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేయనున్నట్లు పేర్కొన్నారు. యాదవులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

ఈదర మహిళకు 108లో కాన్పు

ముండ్లమూరు: మండలంలోని ఈదర గ్రామానికి చెందిన గర్భిణి కె.మనీషా పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కి ఫోన్ చేశారు. సకాలంలో గ్రామానికి చేరుకొన్న 108 వాహనంలో మనీషాను అద్దంకి తరలిస్తుండగా మార్గంమధ్యలో నొప్పులు ఎక్కువ కావడంతో కాన్పు అయ్యే అవకాశాలను గుర్తించారు. 108 ఈఎంటీ హరిబాబు వాహనాన్ని ఆపించి కాన్పు చేశారు. మనీషా ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ సురక్షితంగా ఉండటంతో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మనీషా కుటుంబ సభ్యులు 108 సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.


108లో క్షేమంగా ఉన్న తల్లీబిడ్డ

రక్తహీనతను నివారించడమే ప్రభుత్వ లక్ష్యం


తనిఖీ చేస్తున్న పీడీ ధనలక్ష్మి

తర్లుపాడు: గర్భిణులు, బాలింతల్లో రక్తహీనతను నివారించడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని ఐసీడీఎస్ పీడీ వై.ధనలక్ష్మి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తర్లుపాడు-2, నాయుడుపల్లి అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. పిల్లలు, బాలింతలు, గర్భిణులు రిజిస్టర్‌ను పరిశీలించారు. పీడీ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు రోజూ కోడిగుడ్డు, 200 ఎంఎల్ పాలతో కూడిన సంపూర్ణ భోజనం అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్నట్లు తెలిపారు. ప్రీ స్కూల్ పిల్లలకు మధ్యాహ్న భోజనం, వారానికి 4 కోడిగుడ్లు అందిస్తారన్నారు. 7 నెలల నుంచి 3 ఏళ్ల పిల్లల కోసం విటమిన్స్, మినరల్స్‌తో కూడిన బాలామృతం అందిస్తున్నట్లు చెప్పారు. అనంతరం బాలింతలు, గర్భిణులతో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న మెనూపై పీడీ ధనలక్ష్మి సంతోషం వ్యక్తం చేశారు. ఇన్‌చార్జి సీడీపీవో పద్మావతి, బీపేట సీడీపీవో నాగమణి, కార్యకర్త శివలలితకుమారి, ఆయాలు ఉన్నారు.

మోడల్ డిగ్రీ కళాశాలలో స్కిల్ హబ్ సెంటర్

యర్రగొండపాలెం: స్థానిక త్రిపురాంతకం రోడ్డులోని మోడల్ డిగ్రీ కళాశాలలో స్కిల్ హబ్ సెంటర్‌ను ప్రారంభించనున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీధర్ నాయుడు శుక్రవారం తెలిపారు. ఈ స్కిల్ హబ్ సెంటర్‌లో నిరుద్యోగ యువతకు ప్రస్తుతం డిమాండ్ ఉన్న కోర్సుల్లో మూడు నెలలపాటు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని పేర్కొన్నారు. డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, సోలార్ ప్యానల్ ఇన్‌స్టాలేషన్ టెక్నీషియన్ కోర్సులతో స్కిల్ హబ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్నామని, టెన్త్, ఇంటర్, డిప్లమో, డిగ్రీ పూర్తి చేసుకున్న విద్యార్థులు ఈ కోర్సులకు అర్హులని స్పష్టం చేశారు. త్వరలో తరగతులు ప్రారంభమతాయని, ఆసక్తి ఉన్న అభ్యర్థులు 99499 14337, 88855 81907, 99854 19272ను సంప్రదించాలని సూచించారు.

ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్

● ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం: ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉందని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం ఏ-1 గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులతో ఆయన ముఖాముఖిగా మాట్లాడారు. కాసేపు లెక్చరర్‌గా మారి ఇంజినీరింగ్ విద్యలో మెళకువలు వివరించారు. జగనన్న ప్రభుత్వంలో సచివాలయ వ్యవస్థ ద్వారా లక్షలాది మంది విద్యార్థులకు ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చాయన్నారు. ఇందులో పలువురు ఇంజినీరింగ్ విద్యార్థులు కూడా ఉన్నారన్నారు. నూతన ఆవిష్కరణలు, పరిశోధనలపై విద్యార్థులు దృష్టి పెట్టాలన్నారు. సమాజానికి అవసరమయ్యే పరిశోధనలు కావాలని సూచించారు. ప్రపంచంలో రోజురోజుకూ టెక్నాలజీలో మార్పులు వస్తున్నాయని, ఆ మార్పులు వెంటనే గమనిస్తూ తెలుసుకోవాని సూచించారు. ఎమ్మెల్యే కేపీకి కళాశాల చైర్మన్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ మీర్జా షంషీర్ అలీబేగ్, ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శ్రీధర్, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌కే మహ్మద్ రఫీ తదితరులు ఘన స్వాగతం పలికారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

త్రిపురాంతకం ఆలయాలకు వెండి సామగ్రి బహూకరణ

త్రిపురాంతకం: త్రిపురాంతకేశ్వర స్వామి ఆలయంలో పూజలకు వినియోగించేందుకు ఒంగోలుకు చెందిన ఏరువాక ఆగ్రో ప్రోడక్ట్ కంపెనీకి చెందిన జక్కిరెడ్డి బ్రహ్మరెడ్డి దంపతులు సుమారు రూ.80 వేల విలువైన 1.61 కేజీల వెండి సామగ్రి అందజేశారు. సంప్రోక్షణ అనంతరం వీటిని వినియోగించనున్నట్లు అర్చకుడు విశ్వనారాయణశాస్త్రి తెలిపారు.

పాఠశాలల తనిఖీ

కంభం: మండలంలోని జంగంగుంట్ల ఏటీఆర్ పాఠశాలను, కందులాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను అకాడమిక్ మానటరింగ్ సభ్యులు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని విద్యార్థుల ప్రతిభా పాటవాలు పరీక్షించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు వివరాలు, పాఠ్యప్రణాళిక, వార్షిక ప్రణాళికను పరిశీలించారు. భాషా సామర్థ్యాలు, చతుర్విధ ప్రక్రియలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం తిని పరిశీలించారు. విద్యా పర్యవేక్షణ బృందం సభ్యులు, కె.వెంకటరమణ, వై.వీరనారాయణ, బి.పిచ్చిరెడ్డి, సీఆర్పీ రవీంద్రనాయక్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలికల పాఠశాలను తనిఖీ చేసిన డీఈఓ

పొదిలి రూరల్: దిలి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి పిల్లి రమేష్ ఆకస్మికంగా తణిఖీ చేశారు. ముందుగా ఉపాధ్యాయులను పరిచయం చేసుకున్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాల నిర్వాహణ సక్రమంగా ఉండాలని, ఉపాధ్యాయులు విద్యార్థులకు మంచి విద్యాబుద్ధులు నేర్పించాలన్నారు. పరీక్షల నేపథ్యంలో 10వ తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అనంతరం డీఈఓను ఎంఈఓ ఎం. శ్రీనివాసరెడ్డి శాలువాతో సత్కరించి మంచి పుస్తకం అందజేశారు.

పంచాయతీ నిధుల దుర్వినియోగంపై విచారణ

తాళ్లూరు: మండలంలోని బెల్లంకొండవారిపాలెంలో పంచాయతీ తీర్మానాలు లేకుండా నిధులు దుర్వినియోగం చేశారంటూ గ్రామానికి చెందిన జీవీ శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు మేరకు డీఎల్‌పీఓ పద్మ శనివారం విచారణ చేపట్టారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు దారుడిని పిలిచి విచారణ చేపట్టారు. 2021-22 ఆర్థిక సంవత్సరానికి చెందిన సాధారణ నిధులు రూ.1.88 లక్షలు, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.8.44 లక్షలు తీర్మానాలు లేకుండా డ్రా చేసారని శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. పంచాయతీ సమావేశాలు 90 రోజుల్లో నిర్వహించలేదని, మెజార్టీ వార్డు సభ్యులు తిరస్కరించిన తీర్మానాలు ఆమోదించినట్లు రికార్డుల్లో చూపించారని డీఎల్‌పీఓకి తెలిపారు. స్పందించిన సర్పంచి పోశం సుమలత మంచినీరు, విద్యుత్, పారిశుధ్యం అవసరాల కోసం నిధులు వాడామని చెప్పారు. అందుకు సంబంధించిన రికార్డులు, బిల్లులు కార్యదర్శి శ్రీవల్లి చూపించారు. గ్రామసభ నిర్వహించి ప్రజల ఆమోదంతో ప్రజల అవసరాలు తీర్చామని తాము పైసా కూడా వృథా చెయ్యలేదని వివరించారు. ఇక్కడి పరిస్థితులు ఉన్నతాధికారులకు వివరిస్తానని డీఎల్‌పీఓ తెలిపారు. విచారణలో ఈఓఆర్డీ ఎన్‌యూ ప్రసన్నకుమార్ ఉన్నారు.

ఎమ్మెల్సీగా శ్యాంప్రసాద్‌రెడ్డిని గెలిపించాలి

పొదిలి రూరల్: పట్టభద్రులు తమ అమూల్యమైన ఓటును తూర్పు రాయలసీమ ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డికి వేసి వేయించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పొదిలి మండలం సచివాలయాల కన్వీనర్ల అధ్యక్షుడు పేరం సుభాష్‌చంద్రబోస్‌రెడ్డి కోరారు. శుక్రవారం కుంచేపల్లి సచివాలయం, ప్రభుత్వ పాఠశాల పట్టభద్ర ఓటర్లను కలిసి నిబద్ధతతో పని చేసే శ్యాంప్రసాద్‌రెడ్డికి తమ ఓటు వేయాలని అభ్యర్థించారు. ఆయన వెంట ఇన్నమాల వెంకటాద్రి, కోటా సుధాకర్, కసిరెడ్డి చెంచిరెడ్డి, తాళ్లూరి అశోక్ ఉన్నారు.